కూలీకి 'విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్' చేయూత

దుండిగల్, మే 21: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ఓ పేద వలస కూలీకి చేయూతనిచ్చి ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. సొంత గ్రామంలో ప్రమాదంలో క్షతగాత్రుడైన సోదరుడిని చూసేందుకు రైలు చార్జీలకు డబ్బులు లేక అవస్థలు పడుతున్న వలసకూలీకి ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అశుతోష్‌పటేల్ అనే యువకుడు బతుకు దెరువుకోసం గత కొన్ని రోజుల కిందట నగరానికి వలస వచ్చి నగరశివారు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లిలో నివాసముంటున్నాడు. చిన్నచిన్న కూలీ పనులు చేస్తూ పొట్టపోసుకుంటున్నాడు. అయితే ఇటీవల తన సోదరుడు తమ సొంత గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. తనను చూసేందుకు వెళ్లటకు రైలు చార్జీలకు డబ్బులు లేని గడ్డుపరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్న అశుతోష్ దీనస్థితిని తెలుసుకున్న విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు ఓ నిర్మాణ రంగ ప్రతినిధులతో చర్చించి అశుతోష్‌కు మంగళవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఏజెంట్ లా ఎన్నికల అధికారి సోలోమాన్

అల్లాపూర్, మే 21:కూకట్‌పల్లి తహసీల్దార్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఎలాంటి మందస్తు సమాచారం ఇవ్వకుండా ఫుట్‌పాత్ వ్యాపారులపై జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జులుం చలాయిస్తూ తొలగించిన సంగతి విధితమే. మూసాపేట జోనల్ కార్యాలయంలో ఏఎంహెచ్ఓగా పని చేస్తున్న సోలోమాన్ ప్రస్తుతం(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నాడు. కాగా, ఫుట్‌పాత్‌ల తొలగింపు రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన మంచిపనిగా అభివర్ణిస్తూ.. ట్విట్టర్ వేదికగా పాదచారులతో సోలోమాన్ వీడియోలు చేయించి.. స్వయంగా తన ఖాతాలోనే పోస్టు చేసి ఎన్నికల కోడ్ ఉల్లఘించాడు. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆగ్రహించిన ఫుట్‌పాత్ వ్యాపారస్తులు సోలోమాన్ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సోలోమాన్ కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతూ..ఏజెంటులా వ్యవహరించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించాడంటూ పుత్‌పాత్ వ్యాపారులు మల్కాజిగిరి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్, మే 21 : మేడ్చల్ మండలంలో ఎల్లంపేట గ్రామంలో సర్వే నెంబరు 70, 71లలో హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గోదాంపై చర్య తీసుకోవాలని గ్రామానికి చెందిన తుడుం రాజు జిల్లా కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి పలు దఫాలుగా నోటీసులు జారీ చేసినా నిర్మాణాలు ఆపకుండా చేస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి హెచ్ఎండీఏకు రాసిన దరఖాస్తుకు స్పందిస్తూ ఎన్‌ఫోర్స్ టీంను పంపించేందుకు అంగీకారం తెలిపారన్నారు. అక్రమ నిర్మాణంపై వెంటనే విచారణ జరిపి, చర్య తీసుకోవాలని కోరారు.

ఆటో నడపలేం.. వదిలేసి బతకలేం..

జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాపులో ఆటోలు

లకుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట, మే 21:కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. మహిళలకు ఆర్టీసీ ఉచిత రవాణా అమలుతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిపోయి ఆ వృత్తిలో ఉన్నవారు కొనసాగలేక.. వదిలేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓలా, ఊబర్ వంటి ప్రైవేటు సంస్థలకు ఇటు కార్లు, బైక్‌లు కూడా రవాణాకు ఉపయోగిస్తుండటంతో ఆటోలకు గిరాకీ తగ్గిపోయింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ, సాయం లేకపోవడం, ఆటోలపై నియంత్రణ కొరవడి దశాబ్దాలుగా కొనసాగిన ఆటోడ్రైవర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, గండిమైసమ్మ, బాచుపల్లి, సుచిత్ర, కొంపల్లి ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిర్వహించుకునే ఆటోస్టాండ్లు ఉనికి లేకుండా పోతున్నాయి. ఆటో సొంతమైతే కిస్తీలు కట్టలేక, అద్దెకు తీసుకుంటే పెట్రోలు ఖర్చుకైనా రాక రోజూ రెండుమూడు వందలు సంపాదించలేకపోతున్నాం. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్యం కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది.

కిస్తీలకు కూడా సరిపోవడంలేదు..

మొదట తెలంగాణా ఎన్నికలు, ఇప్పుడు కేంద్ర ఎన్నికలు నాలుగు నెలలుగా ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రతి ఆటోపై రూ.లక్ష వరకు అప్పు లేదా ఫైనాన్స్ ఉంటుంది. కనీసం కిస్తీలు కూడా రాబడిలేదు. గతంలో బస్సులో కొంచెం జనం ఉంటే ఆటోలను ఉపయోగించుకునే వారు. ఇప్పుడు బస్సులు నిండుగా ఉన్నా ఉచితం కావడంతో ఆటోలకు గిరాకీ పోయింది. ప్రత్యామ్నాయం చూపితే తప్ప ఆటో కార్మికులకు ఆర్థిక సమస్యలు తొలగవని పలుపురు ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకునే వారు లేరు..

అద్దె కట్టాలన్నా, రిపేర్ చేయించుకోవాలన్నా కూడా సరిపడా సంపాదన ఉండటం లేదు. వేరే పని చూసుకుందామన్నా దొరకడంలేదు. అప్పులు చేసుకుని ఆటో నడపాల్సి వస్తోంది. పిల్లల చదువు ఫీజులు, పెట్రోలు, నిత్యావసరాలు పెరిగాయి. మాకు మాత్రం గిరాకీలేక అప్పులు మిగులుతున్నాయి.
– మహేశ్, జగద్గిరిగుట్ట

రేవంత్‌రెడ్డి మా పొట్టపై కొట్టాడు..

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఫ్రీ బస్సు పెట్టి మా పొట్టకొట్టాడు. 45 ఏండ్ల కిందట నగరానికి వలస వచ్చిన. నాటి నుంచి ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఏనాడు ఇంత దుస్థితి ఎదురవ్వలేదు. కనీసం మూడు పూటల తిండికి ఇబ్బంది లేకుండే. కానీ ఇప్పుడు గిరాకీ బాగా దెబ్బతిన్నది. రోజుకు రూ.500 కూడా గిట్టుబాటు కావడం లేదు. వచ్చిన డబ్బులు ఆటో ఇంధనానికే సరిపోతుంది. ఫ్రీ బస్సులు విద్యార్థులకు, 50 ఏండ్ల నిండిన వాళ్లకు కల్పిస్తే బాగుంటుంది. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి కండ్లు తెరువాలి. ప్రత్యామ్నాయం చేయాలి. – భాస్కర్‌రావు, సుచిత్ర

ఇంత దారుణం ఎప్పుడూ లేదు

పదేండ్లకు పైగా ఆటో నడిపుతూ జీవనం సాగిస్తున్నా. ఎన్నడూ ఇంతఇబ్బంది పరిస్థితి రాలేదు. ఇన్నాళ్లూ ప్రైవేటు సంస్థలైన ఓలా, ఊబర్ లాంటి వాటితో పోటీ ఉండేది. అయినా రోజూ ఖర్చులు పోనూ రూ.వెయ్యికి పైగా సంపాదన ఉండేది. ఎవరి దగ్గరా పనిచేయకుండా సొంతంగా ఆటో నడుపుకోవడం గర్వంగా ఉంటుండె. ఇప్పుడు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో గిరాకీ మొత్తం పోయింది. ఇంటి ఖర్చులు, పిల్లల చదువులకు అప్పు చేయాల్సి వస్తున్నది. – బాలరాజు, జగద్గిరిగుట్ట

అప్పులే మిగులుతున్నాయి..

పదేండ్లుగా అన్ని ఫ్యాక్టరీలు, కంపెనీలతోపాటు రియల్ ఎస్టేట్ ఉండి ఆటోకు గిరాకీ బాగుంటుండే. మేమే ప్రతి ఆటోస్టాండ్, అడ్డాలో కంట్రోల్ చేసుకుంటూ ప్రాంతాల వారీగా ఆటోలు నడిపేవాళ్లం.సిటీ అంతా తిరిగినా గిరాకీ దొరకడం లేదు. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలికదా.
– ఎండీ సాబేర్, జగద్గిరిగుట్ట

'ఔటర్' లోపు ఫ్రీ బస్సు ఎత్తేయాలి

ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీ బస్సును గ్రామాల సర్వీసులకు నడిపించి, సిటీ బస్సులు, ఔటర్ లోపల ఎత్తేయాలి. తమ లాంటి కుటుంబాలు ఎన్నో ఏండ్లుగా ఆటో నడుపుకుంటూ బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇప్పుడు ఈ పథకం వచ్చి తమ బతుకులపై భారంగా మారింది. ఆటోలు ఫైనాన్స్ తీసుకుంటే నెలనెలకు చెల్లించలేని దయనీయ పరిస్థితి ఏర్పడింది. రోజువారీగా వచ్చే డబ్బులు ఇంట్లో ఖర్చులకు కూడా సరిపోవడంలేదు. తక్కువ ధరకే ఆటోలను అమ్ముకుంటున్నారు. గ్యాస్ ఆటోలపై పెనుభారంగా మారింది. ప్రస్తుత ఖర్చుల కోసం ఆరాటపడటం తప్పా.. భవిష్యత్ కోసం కూడబెట్టుకున్నది ఏం లేకుండాపోతుంది. – శ్రీకుమ్, సుచిత్ర

వీధివ్యాపారులకు అండగా ఉంటా..

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



వీధి వ్యాపారులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, మే 21 : గత 30 ఏండ్లుగా పేద ప్రజలు వీధి వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపైన అధికారులు కర్కశంగా వ్యవహరించి సోమవారం ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సంఘటనా స్థలానికి వెళ్లి వీధి వ్యాపారులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నోఏళ్లుగా జీవనం సాగిస్తున్న వీరి కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా పేద ప్రజలపై ఇలాంటి చర్యలు ఎలా చేపడుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేద ప్రజల పొట్ట మీద కొట్టి పక్కనే ఉన్న మాల్‌కు యాజమాన్యానికి స్థానిక ట్రాఫిక్ సీఐ, జీహెచ్ఎంసీ అధికారులు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి వీధి వ్యాపారులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో తాను వారికి అండగా ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాధితులకు హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

దుండిగల్, మే 21: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను మంగళవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు, యువకులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి తమ తమ ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావుతోపాటు పలుపురు సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తాం



ఆదిత్యానగర్‌లో తలెత్తిన సమస్యలపై వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి అందజేస్తున్న కాలనీవాసులు

అరెకపూడి గాంధీ

మాదాపూర్, మే 21: కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, అధిక ప్రెషర్‌తో నీటిని ప్రజలకు అందేలా చూస్తామని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్ కాలనీలో తలెత్తిన పలు సమస్యలు, యూజీడీ సమస్యలపై మంగళవారం ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో తలెత్తిన తాగునీటి సమస్యతోపాటు ఇతర సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులతోపాటు సీసీ రోడ్లను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. విద్యుత్ అంతరాయం కలుగడంతో చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్, వీధిదీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదిత్యానగర్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాదాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఆదిత్యానగర్ వాసులు ఖాసీం, లియాకత్ అలీ, ఇమ్రాన్, మహ్మద్ అమీర్, సర్ఫార్జ్ మోహిరుద్దీన్, గౌస్, అస్లాం, జావెద్, శ్రీనివాస్ రావు, ఏడుకొండలు, తులసి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

దుండిగల్,మే 21 :ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి (కేఎస్ఆర్) అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసీ) పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీలు/బస్తీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం కేఎస్ఆర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ, తమ కాలనీలు/బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించడంతో పాటు అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

■ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 27వ డివిజన్‌కు చెందిన ధ్యానయోగ శిక్షకురాలు, కాంగ్రెస్ పార్టీ బూత్ ఇన్‌చార్జి రమ కొలన్‌శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ

కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ధ్యానయోగ శిక్షకురాలు రమ

సందర్భంగా ధ్యానయోగం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రత్నకుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొండాపూర్/మాదాపూర్/అల్లాపూర్/శేరిలింగంపల్లి, మే21: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో కొత్తగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మల తొలగింపు పనులతో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాఘవేంద్రకాలనీ ఏ, బీ సీ బ్లాక్‌ల్లో, గోపాల్‌రెడ్డినగర్‌లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

■ చందానగర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శాంతినగర్, దీప్తిశ్రీనగర్, శుభోదయ అపార్ట్‌మెంట్స్, ధర్మపురి టెంపుల్ రోడ్, దీప్తిశ్రీ నగర్ జీహెచ్ఎంసీ పార్క్ ఏరియా, సువేలా ప్రాజెక్ట్, ఆదర్శ్ నగర్‌లో, మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 3 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్స్, దీప్తిశ్రీనగర్, దుర్గ ఎస్టేట్స్, అట్లాంటిక్ సిటీల్లో, మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యానగర్, సురక్ష ఎన్క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, పద్మజ కాలనీ, శుభోదయ కాలనీ, అపర్ణ హిల్స్, అపర్ణ హిల్ వ్యూ పార్క్ అపార్ట్‌మెంట్స్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వేమన వీకర్ సెక్షన్ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

■ మాదాపూర్: 11 కేవీ అయ్యప్ప సొసైటీ ఫీడర్, అల్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ అయ్యప్ప సొసైటీ ఫీడర్ పరిధిలో స్విమ్మింగ్ పూల్, రుచి టిఫిన్ సెంటర్ సమీపంలో, పిల్లర్ నంబర్ 450, 472 ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయగా, 11 కేవీ అల్లాపూర్ ఫీడర్ పరిధిలో ఇంద్రా విల్లాస్, గాయత్రినగర్ ఇండోర్ స్టేడియం, గాయత్రి నగర్, హరిహర టెంపుల్ ఎదురుగా, పద్మావతి హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

■ హఫీజ్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. 11కేవీ దుర్గమ్మ ఫీడర్ మాతృశ్రీనగర్ పరిధిలోని శ్రీలా విల్లాస్, ఎస్ఎంఆర్, వాటర్ వర్క్స్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, సీబీసీఐడీ కాలనీ, బీఎస్ నగర్ ఫేజ్ 2, డైమండ్ హిల్స్, డ్రీమ్‌వ్యూ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు ఆయన తెలిపారు.

■ అల్లాపూర్ డివిజన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు.11/33కేవీ ఫీడర్ పరిధిలో ఇందిరా విల్లాస్, గాయత్రినగర్ ఇండో స్టేడియం, గాయత్రినగర్ హరిహర దేవాస్థానం ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

■ కేపీహెచ్‌బీ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య తెలిపారు. 11/33కేవీ ఫీడర్ పరిధిలోని దేవినగర్, కేరళ బస్తీ, గాయత్రనగర్, రామయ్యనగర్,శాంతినగర్,వెంకట్‌రావునగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 5 గంటల వరకు, 11/33 కేవీ శ్రీసాయినగర్ ఫీడర్ పరిధిలోని దయార్‌గూడ, సాయిబాబా ఆలయం, మైత్రినగర్, వింజానగర్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నది.

■ శేరిలింగంపల్లి : ఫీడర్ మరమ్మతుల కారణంగా గచ్చిబౌలిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. 11కేవీ ఏపీహెచ్‌బీ కాలనీ ఫీడర్ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉద యం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తారు. 11 కేవీ బ్రహ్మకుమారీస్ ఫీడర్ పరిధిలోని బ్రహ్మకుమారీస్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్ ఎన్ క్లేవ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకునిలిపివేస్తామని తెలిపారు.

డీఈ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన

కొండాపూర్ మీటర్ రీడర్ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి : కార్మిక సంఘాలు

కొండాపూర్, మే 21 : విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఆనంద్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంగళవారం కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని డీఈ కార్యాలయం ముందు మీటర్ రీడర్ ఆనంద్ మృతదేహంతో కుటుంబసభ్యులు, కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టారు. కొత్తగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌లో మీటర్ రీడర్‌గా పని చేస్తున్న ఆనంద్ సోమవారం సాయంత్రం రాఘవేంద్ర కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆనంద్ మృతి చెందాడంటూ, కుటుంబసభ్యులు, కార్మిక సంఘాలు ఆనంద్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

రాజీవ్‌గాంధీ వర్ధంతిలో కూనశ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

దుండిగల్/అల్లాపూర్/కొండాపూర్, మే 21 : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయసాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కేపీహెచ్‌బీకాలనీ ఫోరంమాల్ సర్కిల్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆ పార్టీ శ్రేణులతో కలిసి బండి రమేశ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూము వేణు, నాగిరెడ్డి, గాలి బాలాజీ, శేరి సతీశ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, గంధం రాజు, శివ చౌదరి, విటల్ రెడ్డి, అప్పారావు, రజిత, రేష్మ, సంధ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

■ రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ కొ